

# మనం

కృష్ణా / గుంటూరు

ఎన్‌టీఆర్ - బాపట్ల - పల్నాడు

సోమవారం | 22 |జూన్ | 2026 | పేజీలు: 8



## యోగాంధ్ర వైబ్స్










# యోగా... సౌరభం

8 లో

పి.మీరాహుస్సేన్ ఖాన్

- ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగానే పునాది
- యోగాంధ్ర ద్వారా యోగాను ప్రజల జీవితాల్లో భాగం చేయాలనే లక్ష్యం
- యోగ శారీరక, మానసిక ఆరోగ్యానికి అత్యుత్తమ మార్గం
- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



-విజయవాడ, మనంబ్యూరో



7 లో


## 6,65,810 ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

## ప్రశాంతంగా ముగిసిన నీట్

94.13 శాతం హాజరు నమోదు

పరీక్షా నిర్వహణను పర్యవేక్షించిన కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



8 లో

# మానవుని సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణకు యోగ సాధన ఎంతో దోహదం



**▶▶ ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా**

**పామర్రు, జూన్ 21( మనం న్యూస్ ):** మానవుని సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణకు యోగ శిక్షణ ఎంతో దోహదగా నిలుస్తుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమాన్ని స్థానిక ఒకటో సచివాలయం నందు పి4 కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శారీరిక మానసిక ఉల్లాసానికి మనిషి దైనందిన జీవితంలో నిత్యం యోగాను అలవాటు చేసుకోవాలని సూచించారు. తద్వారా పలు అనారోగ్య సమస్యల నుంచి సంపూర్ణ ఆరోగ్యం వంతులు కావచ్చునన్నారు. యోగా గురువు పలు ఆసనాలపై కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ శిక్షణను ఇచ్చారు. ఎంపీడీవో కే జ్యోతి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు బి సుబ్బారావు, పి జనార్దన్ రావు, పంచాయతీ కార్యదర్శి బి వెంకటేశ్వరరావు, ఐదు సచివాలయాలకు చెందిన ఉద్యోగులు పంచాయతీ సిబ్బంది హాజరయ్యారు.

# ఇంద్రకీలాద్రిపై ఘనంగా యోగా దినోత్సవ వేడుకలు



**విజయవాడ ఇంద్రకీలాద్రి, జూన్ 21 (మనం న్యూస్):** ఇంద్రకీలాద్రిపై 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గత 15 రోజులుగా కొనసాగిన 'యోగాంధ్ర' శిక్షణ శిబిరం ఈ కార్యక్రమంతో విజయవంతంగా ముగిసింది. రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ ముఖ్య అతిథిగా హాజరై యోగాసనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంప్రదాయం, దేవాలయ సంస్క ృతిలో యోగా కీలక భాగమని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ) మాట్లాడుతూ కనకదుర్గమ్మ సన్నిధిలో తొలిసారిగా 15 రోజులపాటు యోగా శిక్షణ నిర్వహించడం విశేషమన్నారు. వేలాది మంది భక్తులు, సిబ్బంది ఆరోగ్య అవగాహన పొందారని తెలిపారు.ఆలయ ఈవో వి.కె. శీనా నాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. ఈసారి సుదీర్ఘ శిక్షణ ద్వారా భక్తుల్లో ఆరోగ్యంపై చైతన్యం పెంపొందించగలిగామని చెప్పారు.వేడుకల్లో ధర్మకర్తలు, అధికారులు, అర్చకులు, విద్యార్థులు, సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగాసనాలు, ప్రాణాయామం చేశారు. శిక్షకుడు గర్రె రాజేష్ను అధికారులు సత్కరించారు.

# చిన్నారిని ఆశీర్వదించిన సామినేని ఉదయభాను

**జగ్గయ్యపేట జూన్ 21 మనం న్యూస్:** పెనుగంచిప్రోలులోని, రాధాకృష్ణ ఫంక్షన్ హాల్‌లో వంగవీటి మల్లికార్జునరావు కుమార్తె పుష్పలంకరణ వేడుక సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.



# ఆధునిక చికిత్సలపై అవగాహన పెరగాలి



**▶▶ బాలల ఆర్థోపెడిక్ వైద్యంలో అనేక నూతన ఆవిష్కరణలు**

**▶▶ నవీన శస్త్రచికిత్స పద్ధతులతో మెరుగైన ఫలితాలు**

**▶▶ సరైన నిర్ధారణ, ఆధునిక చికిత్సలతో శాశ్వత వైకల్య నివారణ**

**▶▶ క్లినికల్ అనుభవాలను పంచుకోవడం ద్వారా వైద్యులకు ప్రయోజనం**

**▶▶ ప్రత్యేక ఆకర్షణగా బాలల గాయాల నిర్వహణపై ప్రత్యక్ష ప్రదర్శనలు**

**▶▶ 400 మందికి పైగా ప్రతినిధుల హాజరు**

**గాంధీనగర్, జూన్ 21 మనం న్యూస్:** చిన్నారుల ఎముకల గాయాల చికిత్సకు సంబంధించి తాజా వైద్య విధానాలను వైద్యులకు చేరువ చేయడం, రోగులకు మరింత మెరుగైన చికిత్స అందించడమే లక్ష్యంగా ఐఎఫ్ఐసీఎస్ ఎక్స్ప్రెస్-2026 సదస్సును నిర్వహించినట్లు ప్రముఖ పీడియాట్రిక్ ఆర్థోపెడిక్ శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ కె. దుర్గా నాగరాజు తెలిపారు. నగరంలోని తాజ్ వివంత హోటల్లో ఆదివారం నిర్వహించిన ఇంటర్నేషనల్ ఫ్రాక్చర్స్ ఇన్ చిల్డ్రన్ సింపోజియంలో 400 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సదస్సులో డాక్టర్ దుర్గానాగరాజు ప్రసంగిస్తూ.. పిల్లల ఎముకల గాయాల నిర్వహణలో కొత్త సాంకేతికతలను వైద్యులు ఎప్పటికప్పుడు నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్ఐసీఎస్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ సందీప్ పాత్వర్ధన్ మాట్లాడుతూ బాలల ఎముకల గాయాల చికిత్స పెద్దల చికిత్సకు భిన్నంగా ఉంటుందని, అందుకే ప్రత్యేక నైపుణ్యం అవసరమని పేర్కొన్నారు. వైద్యులు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తమ పరిజ్ఞానాన్ని నవీకరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సాయికృష్ణ మాట్లాడుతూ బాలలలో సంభవించే క్లిష్టమైన ఫ్రాక్చర్లను ఆధునిక శస్త్రచికిత్స పద్ధతుల ద్వారా విజయవంతంగా నయం చేయవచ్చన్నారు. సకాలంలో సరైన చికిత్స అందితే పిల్లలు త్వరగా కోలుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. డాక్టర్ ప్రేమల్ నాయక్ మాట్లాడుతూ బాలలలో ఫైసియల్ ఇంజరీస్, ఫీమర్ నెక్ ఫ్రాక్చర్స్ వంటి సమస్యలను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో శాశ్వత వైకల్యానికి దారితీయవచ్చన్నారు. సరైన నిర్ధారణ, సమయానుకూల చికిత్సతో ఇటువంటి సమస్యలను నివారించవచ్చని చెప్పారు. ప్రొఫెసర్ డాక్టర్ బినోతి శేర్ మాట్లాడుతూ ఇలాంటి శాస్త్రీయ సదస్సులు వైద్యుల మధ్య అనుభవాల మార్పిడికి వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఎదురవుతున్న క్లిష్ట కేసులపై చర్చలు జరగడం వల్ల వైద్య సేవల నాణ్యత మరింత మెరుగుపడుతుందన్నారు. సదస్సులో సుప్రాకాండిలర్ ఫ్రాక్చర్లు, లేటరల్ కాండైల్ ఫ్రాక్చర్లు, ఫోర్ ఆర్మ్ ఫ్రాక్చర్లు, ఫైసియల్ ఇంజరీస్, ఫ్రాక్చర్ నెక్ ఆఫ్ ఫీమర్ తదితర అంశాలపై నిపుణులు శాస్త్రీయ ప్రసంగాలు చేశారు. టెన్స్ నైలింగ్, హిప్ స్ప్రికా అప్లికేష్ప నిర్వహించిన ప్రత్యక్ష ప్రదర్శనలు పాల్గొన్న వైద్యులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విజయవాడ ఆర్థోపెడిక్ సొసైటీ, ఒస్సాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సుకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఆర్థోపెడిక్ వైద్యులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. బాలల ఆర్థోపెడిక్ చికిత్సలో తాజా పరిణామాలపై నిపుణులతో ప్రత్యక్షంగా చర్చించే అవకాశం లభించిందని పాల్గొన్న వైద్యులు తెలిపారు.




# తులసి సంస్థల చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు,వారి తనయుడు తులసి కృష్ణ చైతన్య జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి.



**గుంటూరు జూన్ 21 (మనం న్యూస్ ప్రతినిధి):** ఏటుకూరు లోని జిల్లా పరిషత్ హై స్కూల్లో నూతనంగా నిర్మించిన అసెంబ్లీ హాలును కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తో కలిసి తులసి రామచంద్ర ప్రభు ప్రారంభించారు. టీడీపీ రాష్ట్ర నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య తన సొంత ఖర్చులతో నిర్మించిన భవనాన్ని వారు ప్రారంభించారు. ఉగ్గిరాల సీతారామయ్య మిత్రమండలి ఆధ్వర్యంలో తులసి సంస్థల చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు,వారి తనయుడు తులసి కృష్ణ చైతన్య జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి.అనంతరం మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మీడియాతో మాట్లాడుతూ యోగా ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు.ప్రపంచానికి శాంతితో పాటు యోగ అందించిన ఘనత భారతదేశందే అన్నారు. ప్రస్తుతం యోగా నిత్య జీవన విధానం అయింది అన్నారు. యోగా ద్వారానే ప్రధాని నరేంద్ర మోడీ చంద్రబాబు నాయుడు 75 ఏళ్ళ వయస్సులో కూడా ఉత్సాహంగా పనిచేస్తున్నారని తెలిపారు.ప్రతి ఒక్కరు విధిగా యోగా చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా తులసి సంస్థల చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో పాటు అష్టైశ్వర్యాలతో తులతూగాలని ఆకాంక్షించారు.తులసి రామచంద్ర ప్రభు ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని గుర్తు చేశారు.ఏటుకూరు గ్రామంలో కొన్ని సమస్యలు తన దృష్టికి తెచ్చారని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం టిడిపి రాష్ట్ర నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య మాట్లాడారు. ప్రపంచ యోగ దినోత్సవం సందర్భంగా స్కూలు పిల్లలకు యోగ టీ షర్టులు,మ్యాట్ లు అందించినట్లు చెప్పారు. పాఠశాలలో విద్యార్థులు అసెంబ్లీ నిర్వహించుకునేందుకు యోగ క్లాసులు ఏర్పాటు చేసుకునేందుకు ఒక పెద్ద షెడ్డు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన కేంద్రం మంత్రికి ,తులసి రామచంద్ర ప్రభు కు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డేగల ప్రభాకర్,వడ్రాణం హరిబాబు,గాదె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యకరమైన శరీరం, ప్రశాంతమైన మనసు ,క్రమశిక్షణతో కూడిన జీవన విధానం యోగతో సాధ్యం



▸▸ జగ్గయ్యపేట యోగ వేడుకలలో ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్

**జగ్గయ్యపేట జూన్ 21 మనం న్యూస్ః** ఆరోగ్యకరమైన శరీరం, ప్రశాంతమైన మనసు ,క్రమశిక్షణతో కూడిన జీవన విధానం యోగా ద్వారా లభిస్తుందని శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ అన్నారు.జగ్గయ్యపేటలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పాల్గొన్నారు. జగ్గయ్యపేట పట్టణంలోని కోదాడ రోడ్డులో గల వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో జగ్గయ్యపేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో శాసనసభ్యులు తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వయంగా యోగాసనాలు చేసి యోగా యొక్క ప్రాముఖ్యతను వివరించారు. యోగ గురువులు యుగందర్ పిళ్ళై ఆధ్వర్యంలో గాయత్రి మహిళా యోగ సంఘం సభ్యులు ప్రత్యేక యోగాసన ప్రదర్శనలు నిర్వహించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూ ప్రపంచానికి భారతదేశం అందించిన గొప్ప ఆధ్యాత్మిక మరియు ఆరోగ్య సంపద యోగా అని అన్నారు. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన యోగా నేడు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజల జీవన విధానంలో భాగమైందని తెలిపారు. ఆరోగ్యకరమైన శరీరం, ప్రశాంతమైన మనస్సు, క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని యోగా అందిస్తుందని పేర్కొన్నారు. ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, ఆందోళన, మానసిక సమస్యల నుంచి బయటపడటానికి యోగా ఒక ఉత్తమమైన సాధనమని అన్నారు. ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం 30 నిమిషాల పాటు యోగా చేయడం అలవాటు చేసుకోవాలని, దీనివల్ల శారీరక దృఢత్వం పెరగడమే కాకుండా మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని చెప్పారు. యోగా ద్వారా రక్త ప్రసరణ మెరుగుపడటం, శ్వాసకోశ వ్యవస్థ బలోపేతం కావడం, రోగనిరోధక శక్తి పెరగడం






వంటి అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు. నేటి యువత ఎక్కువ సమయం మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లతో గడపడం వల్ల ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని, యోగా ద్వారా వాటిని అధిగమించవచ్చని తెలిపారు. విద్యార్థులు యోగా చేయడం ద్వారా ఏకాగ్రత పెరిగి విద్యలో మంచి ఫలితాలు సాధించగలరని అన్నారు. మహిళలు, వృద్ధులు, ఉద్యోగులు, విద్యార్థులు ఇలా ప్రతి వర్గానికి యోగా ఎంతో ఉపయోగకరమని, యోగాను జీవితంలో భాగంగా మార్చుకోవాలని సూచించారు. యోగా కేవలం వ్యాయామం మాత్రమే కాకుండా శరీరం, మనస్సు, ఆత్మ మధ్య సమతుల్యతను నెలకొల్పే జీవన విధానమని చెప్పారు. యోగ చేయడం వల్ల డిప్రెషన్, ఆందోళన వంటి మానసిక సమస్యలు తగ్గి సానుకూల ఆలోచనలు పెరుగుతాయని, సరైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యమనే భావనతో ప్రతి ఒక్కరూ యోగాను తమ దినచర్యలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రమాదంలో ఒక చేయి కోల్పోయినప్పటికీ అందరితో సమానంగా యోగాసనాలు చేసి అద్భుత ప్రతిభ కనబరిచిన ఓ మహిళను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. శారీరక పరిమితులు విజయానికి అడ్డంకి కావని, ఆత్మవిశ్వాసం మరియు సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చని ఆమె నిరూపించారని కొనియాడారు. అనంతరం యోగా శిక్షకులు, నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించి, ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పీ.వీ.వీ .డీ ప్రసాద్ , కౌన్సిలర్ గొట్టే నాగరాజు, ఇర్రి నరసింహారావు మరియు మున్సిపల్ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, పెద్ద సంఖ్యలో మహిళలు పేటవాసులు పాల్గొన్నారు.

# క్రాంతి కుటుంబానికి న్యాయం చేయాలి



**విజయవాడ, తూర్పు జూన్ 21 ( మనం న్యూస్):** పోలీసుల వేధింపుల కారణంగానే క్రాంతి కుమార్ ఆత్మహత్య చేసుకున్నారని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలని వైఎస్సార్సీపీ నేతలు డిమాండ్ చేశారు. క్రాంతి కుమార్ మృతికి నెలరోజులు పూర్తయిన సందర్భంగా ఆదివారం ఆయన కుటుంబాన్ని పరామర్శించిన వైఎస్సార్సీపీ నేతల బృందం ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించింది. ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్ మాట్లాడుతూ, సాయికృష్ణ, క్రాంతి కుమార్ మరణాలు ప్రభుత్వ హత్యలేనని ఆరోపించారు. క్రాంతి కుమ్కా ప్రస్తుతం ఎలాంటి కేసులు లేవని, అయినప్పటికీ పోలీసులు వేధింపులకు పాల్పడ్డారని అన్నారు. డీజీపీ, సీపీ బాధిత కుటుంబాలకు క్షమాపణ చెప్పాలని, ఈ కేసుపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, బాధిత కుటుంబాలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయకపోతే వైఎస్సార్సీపీ తరఫున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పూనూరు గౌతమ్ రెడ్డి మాట్లాడుతూ, విజయవాడలో పోలీసులు ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని విమర్శించారు. బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని, న్యాయం జరగకపోతే దళిత సంఘాలతో కలిసి పోరాటం చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా పాలన సాగుతోందని ఆరోపించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్సీపీ నేత పోతిన మహేష్ మాట్లాడుతూ, పోలీసుల వేధింపుల వల్లే క్రాంతి కుమార్ ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. క్రాంతి కుమార్ తండ్రి వెంకటేశ్వరరావును పరామర్శించిన వారిలో దేవినేని అవినాష్, రాయన భాగ్యలక్ష్మి, పూనూరు గౌతమ్ రెడ్డి, షేక్ ఆసిఫ్, పోతిన మహేష్, మాజీ డిప్యూటీ మేయర్ అవుతు శైలజా, కార్పొరేటర్ రహీనా నాహీద్, ఎస్సీ సెల్ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో యోగా దినోత్సవం

**విజయవాడ తూర్పు జూన్ 21 ( మనం న్యూస్):** ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం యోగా ఘనంగా నిర్వహించారు. యోగా ప్రోటోకాల్లో భాగంగా 45 నిమిషాల పాటు వివిధ ఆసనాలు నిర్వహించి శాంతి మంత్రంతో కార్యక్రమాన్ని ముగించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు మాట్లాడుతూ యోగా ప్రతి ఒక్కరి నిత్యజీవితంలో భాగం కావాలని అన్నారు. ఆరోగ్య సమస్యలకు యోగా సమర్థవంతమైన పరిష్కారమని, ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కృషితో యోగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని, భారతదేశం విశ్వగురు స్థానాన్ని మరింత బలపరుచుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మట్టా ప్రసాద్, బొడ్డు నాగలక్ష్మి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిట్ర శివనారాయణ, రాష్ట్ర మీడియా ఇన్చార్జి కిలారి దిలీప్, రాష్ట్ర అధికార ప్రతినిధి యామినీ శర్మ, చైతన్య శర్మ, రత్నకుమారి, జిల్లా యువమోర్చా అధ్యక్షుడు జి. శివకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. యోగా కార్యక్రమ నిర్వాహకుడు కె. మురళీకృష్ణంరాజును దుశ్శాలువాతో సత్కరించారు. కార్యాలయ కార్యదర్శి పవన్ జీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



## ఇంద్రకీలాద్రిపై ఘనంగా యోగా దినోత్సవ వేడుకలు



**విజయవాడ ఇంద్రకీలాద్రి జూన్ 21 (మనం న్యూస్):** ఇంద్రకీలాద్రిపై 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గత 15 రోజులుగా కొనసాగిన 'యోగాంధ్ర' శిక్షణ శిబిరం ఈ కార్యక్రమంతో విజయవంతంగా ముగిసింది. రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ ముఖ్య అతిథిగా హాజరై యోగాసనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంప్రదాయం, దేవాలయ సంస్కృతిలో యోగా కీలక భాగమని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ) మాట్లాడుతూ కనకదుర్గమ్మ సన్నిధిలో తొలిసారిగా 15 రోజులపాటు యోగా శిక్షణ నిర్వహించడం విశేషమన్నారు. వేలాది మంది భక్తులు, సిబ్బంది ఆరోగ్య అవగాహన పొందారని తెలిపారు.ఆలయ ఈవో వి.కె. శీనా నాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. వేడుకల్లో ధర్మకర్తలు, అధికారులు, అర్చకులు, విద్యార్థులు, సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగాసనాలు, ప్రాణాయామం చేశారు. శిక్షకుడు గర్రె రాజేష్ను అధికారులు సత్కరించారు.

## దుర్గమ్మను దర్శించుకున్న సుబ్బారాయుడు



**విజయవాడ పశ్చిమ, జూన్ 21 (మనం న్యూస్):** జనసేన పార్టీ సీనియర్ నాయకుడు, ఆర్యవైశ్య ప్రముఖులు, చార్టెడ్ అకౌంటెంట్ పెనుగొండ సుబ్బారాయుడు ఆదివారం కుటుంబ సమేతంగా ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్తో కలిసి ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థాన అధికారులు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి ప్రత్యేక దర్శనం చేసుకున్న పెనుగొండ సుబ్బారాయుడు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ సంప్రదాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాన్ని ఆయనకు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

# జులై 15లోపు కొత్త అన్నదాన, ప్రసాద భవనాల ప్రారంభం



**విజయవాడ ఇంద్రకీలాద్రి జూన్ 21 ( మనం న్యూస్)**: ఇంద్రకీలాద్రిపై నిర్మాణంలో ఉన్న నూతన అన్నదాన భవనం, ప్రసాదాల తయారీ కేంద్రాన్ని జులై 15లోపు ప్రారంభించేందుకు చర్యలు వేగవంతం చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ ఆదేశించారు. ఆదివారం ఇంద్రకీలాద్రిపై సుడిగాలి పర్యటన నిర్వహించిన ఆయన ఆలయ చైర్మన్, ఈవో, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి అభివృద్ధి పనులను పరిశీలించారు. కొండ దిగువున తుది దశలో ఉన్న అన్నదాన భవనం, ప్రసాదాల తయారీ కేంద్రాన్ని సందర్శించిన కమిషనర్ భక్తుల సౌకర్యాల దృష్ట్యా అవసరమైన మార్పులు, చేర్పులు చేపట్టాలని సూచించారు. జులై రెండో వారంలో ప్రారంభోత్సవం నిర్వహించేలా ఆలయ వైదిక కమిటీతో చర్చించి సోమవారం సాయంత్రంలోగా ముహూర్తం ఖరారు చేసి నివేదిక అందజేయాలని ఈవోకు ఆదేశించారు. ఆషాఢ సారె సమర్పణ, శాఖంబరి ఉత్సవాల నాటికి ఈ భవనాలు అందుబాటులోకి వస్తే భక్తులకు మరింత సౌకర్యంగా ఉంటుందని కమిషనర్ పేర్కొన్నారు. కొండపై నిర్మిస్తున్న క్యూ కాంప్లెక్సుకు అవసరమైన స్థల సేకరణ ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని సూచించారు. దుర్గమ్మ క్షేత్ర అభివృద్ధి, భక్తులకు అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతుల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కమిషనర్ తెలిపారు. ఈ పర్యటనలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్, ధర్మకర్తల మండలి సభ్యులు ఏ. శ్రీనివాసరావు, టి. హరికృష్ణ, పి. రాఘవరాజు, ఎస్. సరిత, ఆలయ ఈఈతో పాటు ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి ఓటుకు విలువ పెంచేదే సరైన ఓటరు జాబితా

**9వ డివిజన్లో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే గద్దె రామమోహన్**



**విజయవాడ తూర్పు, జూన్ 21 (మనం న్యూస్)**: ఓటరు జాబితాలో ఖచ్చితత్వం ఉంటేనే ప్రతి ఓటుకు పూర్తి విలువ దక్కుతుందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం అమలును ఆదివారం 9వ డివిజన్ పటమటలంకలోని లైబ్రరీ సెంటర్ వద్ద ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని పేర్కొన్నారు. ఓటరు జాబితాలో తప్పుడు పేర్లు, తప్పుల వివరాలు కొనసాగితే అసలైన ఓటర్ల హక్కులకు భంగం కలిగే అవకాశం ఉంటుందన్నారు. అందుకే ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమానికి ప్రజలు సహకరించి తమ వివరాలను సరిచేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండటంతో పాటు వివరాలు సక్రమంగా నమోదవడం అవసరమని చెప్పారు. ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు, ఇతర వివరాల్లో ఉన్న లోపాలను సరిదిద్దుకునేందుకు ఈ కార్యక్రమం మంచి అవకాశమని పేర్కొన్నారు. ప్రజలు చొరవ చూపి తమ వివరాలను ధ్రువీకరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఎల్వో ప్రవీణ్, పార్టీ నాయకులు చెన్నుపాటి గాంధీ, కాంతిశ్రీ, కర్ణ రమేష్, పఠాన్ హయత్ఖాన్, సుధీర్, గోపి తదితరులు పాల్గొన్నారు.

# లలితా పి వి ఎస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం




**గుంటూరు జూన్ 21 (మనం న్యూస్ ప్రతినిధి)**: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా అత్యుత్తమ మార్గమనే సందేశంతో లలితా పివిఎస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్లో ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో వెయ్యికి పైగా మంది వైద్యులు,నర్సింగ్ స్టాఫ్ , హాస్పిటల్ సిబ్బంది,అడ్మిన్ స్టాఫ్,నర్సింగ్ మరియు పారామెడికల్ విద్యార్థులు, రోగులు, వారి సహాయకులు, కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొని యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన యోగా కార్యక్రమం ద్వారా ఆరోగ్య సంరక్షణలో నివారణకు ప్రాధాన్యం,శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత మరియు సమగ్ర ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.లలితా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్ డా. పి.వి. రాఘవ శర్మ మాట్లాడుతూ, భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు ప్రారంభించిన అంతర్జాతీయ యోగా దినోత్సవం నేడు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందిని యోగా వైపు ఆకర్షించిందన్నారు.అలాగే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యోగా, ధ్యానం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని నిరంతరం ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ స్ఫూర్తితో లలితా పివిఎస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్లో రోగులు,వారి సహాయకులు,ఆసుపత్రి సిబ్బంది, విద్యార్థులు మరియు ప్రజలందరికీ ప్రతిరోజూ ఉచిత యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు.సీ ఈ ఓ డా.పి.అనురాగ్ మాట్లాడుతూ,యోగా ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగం కావాలని,క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా ఒత్తిడి తగ్గి,శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యం పెంపొందుతుందని తెలిపారు.డైరెక్టర్ మరియు మెడికల్ ఆంకాలజిస్ట్ డా.బి.స్రవంతి మాట్లాడుతూ,క్యాన్సర్ చికిత్స పొందుతున్న రోగులకు యోగా ఎంతో మేలు చేస్తుందని తెలిపారు.శాస్త్రీయ పరిశోధనల ప్రకారం యోగా వల్ల చికిత్స సమయంలో కలిగే సైడ్ ఎఫెక్ట్స్ తక్కువగా ఉండటం,అలసట, నిరాశ వంటి సమస్యలు తగ్గి, శారీరక శక్తి,మానసిక ఉల్లాసం, జీవన నాణ్యత మెరుగుపడుతాయని వివరించారు.యోగా అనేది రోగులకు మాత్రమే కాకుండా ఆరోగ్యం గా ఉన్నవారు అలవాటు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.ప్రముఖ యోగా గురువు శ్రీ రెడ్డి సాంబశివరావు ఆధ్వర్యంలో యోగాసనాలు,ప్రాణాయామం, ధ్యానం నిర్వహించారు. కార్యక్రమం చివరలో అందరూ ప్రతిరోజూ యోగా సాధన చేసి, ఆరోగ్య సందేశాన్ని సమాజంలో విస్తృతంగా ప్రచారం చేయాలని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో డా. పి.వి. రాఘవ శర్మ, డా.పి.విజయ, డా.పి.అనురాగ్,డా.బి. స్రవంతి,డా.ఎన్.శ్రీనివాసరావు, డా.ఎస్.అనిల్,డా.స్వాతి,డా. ప్రత్యూష్ , డా.జై హరీష్ తదితర వైద్యులు పాల్గొన్నారు. అలాగే ఆసుపత్రి సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది,నర్సింగ్ కళాశాల విద్యార్థులు, పారామెడికల్ విద్యార్థులు, రోగులు, వారి సహాయకులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# హిందూ దేవాలయాల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయం

**ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా**



**పామర్రు, జూన్ 21(మనం న్యూస్)**: హిందూ దేవాలయాల అభివృద్ధికి దాతలు అందిస్తున్న చేయూత అభినందనీయమని పామర్రు ఎమ్మెల్యే వరల కుమార్ రాజా అన్నారు. మండల పరిధిలోని పసుమర్రు గ్రామంలో ఏం చేసి ఉన్న శ్రీ గంగా పార్వతీ సమేత సోమేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో దాతల సౌజన్యంతో పునప్రతిష్టించిన నూతన ధ్వజస్తంభ మరియు నవగ్రహ ల ప్రతిష్టా కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హిందూ దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వంతో పాటు దాతలు మరింత ముందుకు వచ్చి సహకరించటం అభినందనీయమన్నారు. విచ్చేసిన భక్తులకు పెద్ద సంఖ్యలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొప్పన కోటేశ్వరరావు, కాజా వెంకట్రావు కనకదుర్గ దంపతులతో పాటు, తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్టు వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, ఆలయ అధికారి పివిన్వి ప్రసాదరావు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక.కమిషనర్ కె.మయూర్ అశోక్



**గుంటూరు నగరపాలక సంస్థ జూన్ 21 (మనం న్యూస్ ప్రతినిధి)** : జూన్ 22వ తేది సోమవారం గుంటూరు నగర ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు గుంటూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా జిఎంసి విభాగాధిపతులతో కలిసి ప్రజల నుండి నేరుగా అర్జీలు,ఫిర్యాదులు తీసుకుంటామని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

# ప్రజా భాగస్వామ్యంతో జల వనరుల పునరుద్ధరణకు శ్రీకారం



**వీరులపాడు జూన్ 21, మనం న్యూస్** : వీరులపాడు మండలం చౌటపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన 'జలదార - జలహారతి, జనచైతన్యం - జలచైతన్యం' కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రజా భాగస్వామ్యంతో జల వనరుల పునరుద్ధరణ, నీటి భద్రత మరియు సాగునీటి సంఘాల బాధ్యతలను బలోపేతం చేయడం లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని కొత్తచెరువు ఫీడర్ చానళ్ల పూడికతీత పనులను కూటమి నాయకులు, అధికారులు, రైతులు మరియు గ్రామస్థులతో కలిసి కొబ్బరికాయ కొట్టి ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, చెరువులు, కాలువలు మరియు ఫీడర్ చానళ్ల పునరుద్ధరణ ద్వారా భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయానికి అవసరమైన నీటి నిల్వలు మెరుగుపడతాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నీటి వనరుల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి గ్రామంలో ప్రజల సహకారంతో చెరువులు, కాలువలను అభివృద్ధి చేసి భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించడమే లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. జల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, సాగునీటి సంఘాలు మరింత చురుకుగా పనిచేసి నీటి వనరుల పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, కూటమి నాయకులు, రైతులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నీట్ (యూజీ)-2026 పునఃపరీక్ష సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందల్




**గుంటూరు జూన్ 21( మనం న్యూస్ ప్రతినిధి)**జాతీయ పరీక్షల సంస్థ (ఎన్టీఏ) ఆధ్వర్యంలో ఈరోజు నిర్వహిస్తున్న నీట్ (యూజీ)-2026 పునఃపరీక్ష నేపథ్యంలో గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 26 పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా,పరీక్షలను ప్రశాంతంగా,పారదర్శకంగా మరియు సురక్షిత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ తరపున పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపీఎస్ ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రాల వద్ద తగిన సంఖ్యలో పోలీస్ అధికారులు, సిబ్బంది,మహిళా పోలీస్ సిబ్బంది,ట్రాఫిక్ సిబ్బంది నియమించబడగా,పరీక్ష ప్రారంభానికి ముందే అన్ని కేంద్రాల వద్ద భద్రతా చర్యలు అమలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పలు పరీక్షా కేంద్రాలను స్వయంగా సందర్శించి,అక్కడ చేపట్టిన బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. అభ్యర్థుల ప్రవేశ సమయంలో నిర్వహిస్తున్న తనిఖీలు,హాల్ టికెట్లు మరియు గుర్తింపు కార్డుల ధృవీకరణ ప్రక్రియ, మహిళా అభ్యర్థుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక తనిఖీ సదుపాయాలు,కేంద్రాల పరిసర ప్రాంతాల్లో చేపట్టిన భద్రతా చర్యలను పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా ప్రత్యేక ట్రాఫిక్ నిర్వహణ చర్యలు చేపట్టడంతో పాటు, తల్లిదండ్రులు మరియు అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్ సిబ్బంది సహాయక చర్యలు అందిస్తున్నారు.పరీక్షా కేంద్రాల చుట్టుపక్కల అనుమానాస్పద వ్యక్తులు సంచరించకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు



చేయడంతో పాటు, సున్నితమైన కేంద్రాల వద్ద అదనపు బందోబస్తు కల్పించబడింది.పరీక్షా ప్రక్రియకు అంతరాయం కలిగించే ప్రయత్నాలు,మాల్ప్రాక్టీస్లు లేదా ఇతర అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టారు.అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స సదుపాయాలు, అంబులెన్స్ సేవలు మరియు సంబంధిత శాఖలతో సమన్వయ వ్యవస్థను కూడా సిద్ధంగా ఉంచారు.పరీక్షలు పూర్తయ్యేంత వరకు విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని,ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. గుంటూరు జిల్లా పోలీస్ పోలీస్ అధికారులు పరీక్షల నిర్వహణకు అవసరమైన భద్రత,శాంతి భద్రతలు మరియు ట్రాఫిక్ నియంత్రణ చర్యలను సమర్థవంతంగా అమలు చేస్తూ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టారు.

## ఉప్పలమ్మ తల్లి పూజా కార్యక్రమంలో పాల్గొన్న తన్నీరు నాగేశ్వరరావు



**జగ్గయ్యపేట జూన్ 21 మనం న్యూస్ః** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు ఆదివారం ఉప్పలమ్మ తల్లి పూజా కార్యక్రమాలలో పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. జగ్గయ్యపేట నియోజకవర్గం వత్సవాయి గ్రామం మండల విద్యార్థి విభాగ అధ్యక్షులు బత్తుల పవన్ స్వగృహం నందు ఉప్పలమ్మ తల్లి ఎల్లమ్మ తల్లి పూజ కార్యక్రమంలో పాల్గొన్న జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్- ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు యేసుపోగు దేవమణి-శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు గుత్త శంకర్రావు, గ్రామ పార్టీ అధ్యక్షులు మెట్టుకోలు నరేష్, రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి నంబూరి రవి, మండల ముస్లిం మైనార్టీ, యువజన విభాగాల అధ్యక్షులు షేక్ బాజీ, కొట్టే నగేష్, తదితరులు పాల్గొన్నారు వత్సవాయి మండలం కొత్త వేమవరం గ్రామానికి చెందిన కాకాని గోపి స్వగృహంలో ఏర్పాటు చేసిన ఎల్లమ్మ తల్లి ఉప్పలమ్మ తల్లి పూజా కార్యక్రమంలో తన్నీరు నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి నంబూరు రవి గ్రామ నేతలు పాల్గొన్నారు.

## జయంతి నుండి ఎర్రుపాలెం వెళ్లే రోడ్ ప్రారంభం



**వీరులపాడు జూన్ 21, మనం న్యూస్ః** ది.20-06-2026 న జయంతి గ్రామంలో సాయంత్రం 6 గంటలకు నిర్వహించిన, జయంతి- ఎర్రుపాలెం రోడ్డును నందిగామ శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ప్రారంభించబడినది. ఈ సందర్భంగా ఏం. ఎల్. ఏ మతాలుడుతూ జయంతి -ఎర్రుపాలెం రోడ్డు అంచనా వ్యయా ఒక కోటి 75 లక్షల రూపాయలతో ఈ రోడ్డు నిర్మాణము పూర్తిగావించి ఠ బడినది అని, అదే విధముగా మండలం లో మరికొన్ని రోడ్ లు పనులు నడుస్తున్నవి అని, తెలుగుదేశం మొదటి లక్ష్యం డోవలప్మెంట్, గుంతలు లేని రోడ్ లు రాష్ట్రం లో చూడాలని ఏం. ఎల్. ఏ తెలియపరచిన్నారు.

## కాంట్రాక్ట్ నర్సులకు క్రమబద్ధీకరణ అవకాశం కల్పించాలి

**విజయవాడ తూర్పు జూన్ 21 (మనం న్యూస్)ః** రాష్ట్రంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులతో పాటు అన్ని శాఖలలోని అర్హులైన కాంట్రాక్ట్ ఉద్యోగులకు క్రమబద్ధీకరణ అవకాశం కల్పించేలా ప్రస్తుత చట్టాన్ని సవరించాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ నర్సెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏ.జి.కె. చైతన్య ప్రభుత్వాన్ని కోరారు.ప్రభుత్వం ఇటీవల కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు చేపట్టిన చర్యలను స్వాగతిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం అమలులో ఉన్న చట్టం ప్రకారం ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులకు క్రమబద్ధీకరణ అవకాశం లేకపోవడం ఆందోళన కలిగిస్తోంద న్నారు.ప్రజలకు ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించారని గుర్తుచేశారు. అలాంటి ఉద్యోగులు క్రమబద్ధీకరణకు నోచుకోకపోవడం బాధాకరమన్నారు.రాష్ట్ర ప్రభుత్వ సేవలో అంకితభావంతో పనిచేస్తున్న మిగిలిన కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ న్యాయం జరిగేలా చట్ట సవరణ చేపట్టి వారిని రెగ్యులర్ చేసే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఒకరికి న్యాయం కాదు... అందరికీ న్యాయం జరగాలి అనే స్ఫూర్తితో ప్రభుత్వం సమగ్ర నిర్ణయం తీసుకుని కాంట్రాక్ట్ ఉద్యోగుల భవిష్యత్తును భద్రపరచాలని కోరారు.

## ఈ నెల 24న విజయవాడలో మెగా జాబ్ డ్రైవ్

- 300కు పైగా ఉద్యోగ ఖాళీల భర్తీ
- జిల్లా నైపుణ్యాబివృద్ధి అధికారి ఎస్. శ్రీనివాసరావు.

**విజయవాడ,జూన్, 21,(మనం న్యూస్)ః** నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఆ్యఖిఖ్రిఇ) ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన విజయవాడలో ప్రత్యేక ఉద్యోగ మేళా (ఖిఇ్ఛఛిజీజజీఛి ఒొఛృటజీర్ఛి) నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ అంతర్జాతీయ సంస్థ యమ్.ఆర్.ఎఫ్ (ఓఖఊ) కంపెనీలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను ఈ డ్రైవ్ ద్వారా భర్తీ చేయనున్నారన్నారు. ఈనెల24వ తేదీ (బుధవారం) ఉదయం 09:30 గంటలకు జిల్లా ఉపాధి కార్యాలయం (ృజీట్టటజీఛ్టి ఉఝఞఇజూౌఢ్ఝ్ఞ్టట ఉ్ఛజీఛ్చి జజజీఛ్ఛి), ప్రభుత్వ ఐ.టి.ఐ కాలేజీ ప్రాంగణం, రమేష్ హాస్పిటల్స్ రోడ్, విజయవాడ వద్ద హాజరు కావాలని కోరారు. ాఆ్కఖి ట్రైనీ మరియు ప్రొడక్షన్ అసోసియేట్ ఉద్యోగాలను భర్తీ చేయనున్నామని, 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐ.టి.ఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఆ.ఖ్ఛిఛిజి మరియు పి.జి పూర్తి చేసిన వారు అర్హులు అన్నారు. 18 సంవత్సరాల నుండి 35 ఏళ్ల లోపు యువతీ యువకులు అర్హులన్నారు. నెలకు రూ. 18,000/- నుండి రూ. 40,000/- వరకు (అర్హతను బట్టి). వేతనం ఉంటుందని అన్నారు. ఈఎస్ఐ (ఉఖిఐ), పి.ఎఫ్ (ృఊ), గ్రాట్యుటీ, అటెండన్స్ బోనస్ తో పాటు సబ్సిడీ భోజనం మరియు రవాణా సౌకర్యం కల్పించబడుతుందన్నారు. ఎంపికైన వారు ఓఖఊ, మెదక్ ప్లాంట్, సంగారెడ్డి జిల్లాలో ఉద్యోగం చేయవలసి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ముందుగా ఞ్టిఇట//ృఞజీఇ్ఢఢ్చఝ.ాఇజౌరి.జీ/ఞ్ఛట-ట్ఛఞజీ్టటఞ్ఞజీౌ వెబ్సైట్ నందు తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 62814 28641 నంబరును సంప్రదించాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్ శ్రీనివాసరావు ఆ ప్రకటనలో కోరారు.

## మహిళల సమస్యల పరిష్కారానికై పోరాటాలకు సిద్ధం కండి



- కోట మాల్యాద్రి సిపిఐ గుంటూరు జిల్లా కార్యదర్శి

**గుంటూరు జూన్ 21 (మనం న్యూస్ ప్రతినిధి)ః** ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య గుంటూరు నగర మహాసభలు ఈనెల 25వ తేదీన కొత్తపేట మల్లయ్య లింగం భవన్ లో జరుగుతున్న సందర్భంలో నేడు శారదా కాలనీలో మహిళా సమాఖ్య నూతన శాఖను ఏర్పాటు చేయడం జరిగింది . ఈ మహాసభకు కోట తిరుపతమ్మ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిపిఐ గుంటూరు జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ ప్రపంచం నూతన టెక్నాలజీలతో అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తున్న సమాజంలో మహిళలు నేటికి అనేక అవమానాలకు గురవుతున్నారని , దేశంలో ప్రతిరోజు వందలాదిమంది మహిళలు అత్యాచారాలకు, హత్యలకు గురవుతూ ఉన్నారని వాటికి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య గుంటూరు నగర ప్రధాన కార్యదర్శి గుండెబోయిన లక్ష్మి, సిపిఐ గుంటూరు నగర కార్యదర్శి ఆకీటి అరుణ్ కుమార్ మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయట్లేదని 18 సంవత్సరాలు నిండిన మహిళలకు 15000 ఇస్తామని చెప్పి రెండు సంవత్సరాలు గడుస్తున్న అమలు చేయడం లేదని,నూతన పింఛన్లు ఇదిగో ఇస్తాం అదిగో ఇస్తాం అని చెబుతూ ప్రచారం చేసుకుంటున్నారే తప్ప ఆచరణలో అమలు చేయడం లేదని తదితర సమస్యల పరిష్కారం కొరకు మహిళలు చైతన్యవంతులై ముందుకు కదలాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నారా కమిటీ సభ్యులు నూతలపాటి చిన్న స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శారదా కాలనీ ప్రాంత ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నూతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది.

## కాంట్రాక్ట్ నర్సులకు క్రమబద్ధీకరణ అవకాశం కల్పించాలి

**విజయవాడ తూర్పు జూన్ 21 (మనం న్యూస్)ః** రాష్ట్రంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులతో పాటు అన్ని శాఖలలోని అర్హులైన కాంట్రాక్ట్ ఉద్యోగులకు క్రమబద్ధీకరణ అవకాశం కల్పించేలా ప్రస్తుత చట్టాన్ని సవరించాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ నర్సెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏ.జి.కె. చైతన్య ప్రభుత్వాన్ని కోరారు.ప్రభుత్వం ఇటీవల కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు చేపట్టిన చర్యలను స్వాగతిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం అమలులో ఉన్న చట్టం ప్రకారం ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులకు క్రమబద్ధీకరణ అవకాశం లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు.ప్రజలకు ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించారని గుర్తుచేశారు. అలాంటి ఉద్యోగులు క్రమబద్ధీకరణకు నోచుకోకపోవడం బాధాకరమన్నారు.రాష్ట్ర ప్రభుత్వ సేవలో అంకితభావంతో పనిచేస్తున్న మిగిలిన కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ న్యాయం జరిగేలా చట్ట సవరణ చేపట్టి వారిని రెగ్యులర్ చేసే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఒకరికి న్యాయం కాదు... అందరికీ న్యాయం జరగాలి అనే స్ఫూర్తితో ప్రభుత్వం సమగ్ర నిర్ణయం తీసుకుని కాంట్రాక్ట్ ఉద్యోగుల భవిష్యత్తును భద్రపరచాలని కోరారు.

## నందిగామలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు



- **జడ్పీ హైస్కూల్లో నిర్వహించిన యోగేంద్ర కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**
- **యోగా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి మార్గమని వ్యాఖ్య..**

**నందిగామ,జూన్21(మనం న్యూస్)ః** నందిగామ పట్టణంలోని జడ్పీ హైస్కూల్ ఆవరణలో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన యోగేంద్ర కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజానీకంతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగా సాధనలో పాల్గొన్న ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప ఆధ్యాత్మిక, ఆరోగ్య సంపద అని అన్నారు. ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపొందుతాయని పేర్కొన్నారు. ఆధునిక జీవనశైలిలో ఏర్పడుతున్న ఒత్తిడి, అనారోగ్య సమస్యలను అధిగమించడానికి యోగా అత్యుత్తమ సాధనమని వివరించారు.ప్రజలందరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగంగా చేసుకొని ఆరోగ్యవంతమైన జీవనం గడపాలని ఆమె పిలుపునిచ్చారు. యువత, విద్యార్థులు యోగాపై ఆసక్తి పెంపొందించుకోవడం ద్వారా శారీరక, మానసిక వికాసాన్ని సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యోగా శిక్షకులు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొని యోగా ఆసనాలు నిర్వహించారు. యోగా ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు సూచించారు.

## ఏపీ తొలి సైనిక్ వెల్ఫేర్ మాజీ డైరక్టర్ స్వర్ణ కుమారి కన్నుమూత!



**విజయవాడ, జూన్,21,(మనం న్యూస్)ః** ఆంధ్రప్రదేశ్ సైనిక సంక్షేమ శాఖ మాజీ డైరెక్టర్ టి. స్వర్ణ కుమారి (66) ఆదివారం విజయవాడలో కన్నుమూశారు. రాష్ట్ర విభజన తర్వాత, రెండుగా విడిపోయిన ఈ శాఖ ఏపీ విభాగానికి స్వర్ణకుమారి పదేళ్ల పాటు హెచ్వోడీ బాధ్యతలను నిర్వహించారు. పదవీ విరమణ తర్వాత స్థానికంగా గుంటుపల్లిలో ఆమె నివాసం ఉంటున్నారు. కాగా కొంతకాలంగా అస్వస్థతగా ఉంటున్న ఆమె, స్థానికంగా వైద్య ఆరోగ్య సేవలు పొందారు. భర్త రిటైర్డ్ బ్యాంక్ ఆఫీసర్ కాగా, వారికి ఒక కుమారుడు ఒక కుమార్తె ఉన్నారు. సోమవారం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలియచేశారు.

## మద్దులమ్మ తల్లికి వరద పాశం...

**కంచికచర్ల (మనం న్యూస్)ః** కంచికచర్ల మండల పరిధిలోని గొట్టుముక్కల గ్రామ అటవీ ప్రాంతంలో గత 150 సంవత్సరాల క్రితం స్వయంభువుగా వెలసిన మద్దులమ్మ తల్లికీ ఆదివారం వరద పాశం నిర్వహించారు ఆలయ కమిటీ ,మద్దులమ్మ తల్లి దేవాలయం ప్రస్తుతం భక్తులు, పర్యాటకులతో కిటకిటలాడుతోంది. వర్షాభావ పరిస్థితుల్లో అమ్మవారికి వరద పాశం పోస్తే తప్పనిసరిగా వర్షాలు కురుస్తాయనే నమ్మకం స్థానిక ప్రజల్లో ఉంది. ఈ ఆచారం పూర్వం నుంచి కొనసాగుతూ వస్తోందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.గొట్టుముక్కల, పరిటాల, నరసింహారావుపాలెం తదితర గ్రామాల ప్రజలు విశ్వాసంతో ప్రతి ఏడాది మద్దులమ్మ తల్లికి వరద పాశం పోస్తూ ఉంటారు.ఆలయం సమీపంలో అడవిలో నుంచి లోయ దిగువ వరకు విస్తరించిన సహజసిద్ధమైన జలపాతం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. జూన్ నెల నుంచి జనవరి వరకు పూర్తిస్థాయిలో, పాక్షికంగా ఈ జలపాతం సంవత్సరమంతా ప్రవహిస్తూ ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటోందిపచ్చని అడవి అందాలు, నిత్యం ప్రవహించే జలపాతం, మద్దులమ్మ తల్లి ఆలయ ఆధ్యాత్మిక వాతావరణం సందర్శకులకు ఆహ్లాదకర అనుభూతిని కలిగిస్తున్నాయి.ఇటీవల విజయవాడ పరిసర ప్రాంతాల నుంచి ఇక్కడికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో నూతన భక్తుల కోసం కొత్తగా షెడ్లు. నిర్మించారు.వేద పండితులు, పురోహితులు అమ్మవారికి వరద పాశం



నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుజల్లులు కురవడం ఆనవాయితీగా వస్తోందని భక్తులు పేర్కొంటున్నారు అమ్మవారి మహత్యాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు.అలాగే భక్తులకు భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం చేశారు ఆలయ కమిటీ,గ్రామ పెద్దలు.

## మైనారిటీల సంక్షేమానికి అండగా ఉంటాం

- **తబ్లీగీ జమాత్ ప్రతినిధులతో భేటీలో ఎంపీ కేశినేని చిన్ని**

**విజయవాడ పశ్చిమ, జూన్ 21 ( మనం న్యూస్)ః** మైనారిటీల సంక్షేమం, అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. పాతపాడు వద్ద నిర్మించనున్న తబ్లీగీ జమాత్ రాష్ట్ర కార్యాలయం, మసీదు శంకుస్థాపన కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ జమాత్ ప్రతినిధులు ఆదివారం ఆయన కార్యాలయంలో కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధి చెందితేనే రాష్ట్రం పురోగతి సాధిస్తుందని పేర్కొన్నారు. మైనారిటీల సామాజిక, విద్యా, ఆర్థిక అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు తన కార్యాలయం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. మతాలకు అతీతంగా ప్రజలందరికీ సేవ చేయడమే ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని చెప్పారు.సమాజంలో సోదరభావం, సామరస్యం మరింత బలపడేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. మత, సామాజిక సంస్థలు ప్రజల్లో మంచి విలువలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. తబ్లీగీ జమాత్ చేపడుతున్న కార్యక్రమాలు ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై ప్రతినిధులతో చర్చించిన ఎంపీ, కార్యక్రమానికి తన వంతు సహకారం అందించడంతో పాటు హాజరవుతానని హామీ ఇచ్చారు. దీనిపై తబ్లీగీ జమాత్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఫతావుల్లా ఆధ్వర్యంలో జరిగిన ఈ భేటీలో తబ్లీగీ జమాత్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అక్బర్, జమాత్ పెద్దలు అహ్మద్, హుస్సేన్, టీడీపీ సీనియర్ నాయకుడు బొప్పన భవకుమార్, రాష్ట్ర కార్యదర్శి షేక్ ఆషా, పశ్చిమ నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు తమీం అన్సార్, ఇర్ఫాన్, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.



## బాల సైదా సేవా సమితి నేతలకు మొహరం శుభాకాంక్షలు తెలిపిన సామినేని విమల భాను



**జగ్గయ్యపేట జూన్ 21 మనం న్యూస్ ః** బాల సైదా ఫౌండేషన్ సభ్యులకు వారు చేస్తున్న సేవా కార్యక్రమాలు అలానే మొహరం పండుగ సందర్భం గా విమల భాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమల భాను శుభాకాంక్షలు తెలిపారు. జగ్గయ్యపేట మండలం,అగ్రహారం వాస్తవ్యులు బాల సైదా సేవా సమితి ఫౌండేషన్ వ్యవస్థాపకులు షేక్ ఖాజా, వారి సతీమణి షేక్ కరీంభీ దంపతులను వారి మిత్ర బృందాన్ని, తోటి సహాయకులను మొహరం పండుగ నెల సందర్భంగా, అలాగే వారి ఫౌండేషన్ తరపున చేసే మజ్జిగ పంపిణీ, అన్నదానం, ఉచిత అంబులెన్సు సదుపాయం తదితర సేవా కార్యక్రమాలను గాను ఆదివారం విమలాభాను ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను సతీమణి సామినేని విమలాభాను , వారి కుమారులు యువనేత సామినేని ప్రశాంత్ బాబు లు వారి స్వగృహం లో ఘనంగా శాలువాతో వారిని సన్మానించి మొహరం పండుగ శుభాకాంక్షలు తెలియజేసారు,అలాగే వారు చేసే సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా చేయాలనీ,వారికి దేవుని ఆశీస్సులు ఎలావేళలా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.ఈ కార్యక్రమం లో (బి కే ఎస్)రాష్ట్ర కార్యదర్శి అడపా రమణి , నాయకులు రాంబాబు , నరసింహారావు బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

# తాసిల్దార్‌గా పదోన్నతి పొందిన పి డి ఎస్ డి టీ అంకాలు బన్నారావూరికి ఘన సన్మానం



హనుమాన్ జంక్షన్: జూన్ 21 ( మనం న్యూస్)ః గన్నవరం నియోజకవర్గం పరిధిలో మూడు మండలాల్లో రేషన్ పంపిణీ పక్కాగా, పారదర్శకంగా జరిగేలా పీడీఎస్ డీటీ బన్నారావూరి అంకాలు ప్రత్యేక శ్రద్ధ వహించారని పలువురు ప్రశంసించారు. తహశీల్దారుగా పదోన్నతి పొందిన అంకాలుకు బాపులపాడు, ఉంగుటూరు మండలాల్లో రేషన్ డీలర్ల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి వీడ్కోలు అభినందన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బాపులపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాపులపాడు తహసీల్దార్ బండ్రెడ్డి మురళీకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.పీడీఎస్ డీటీ గా అంకాలు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమర్థంగా కృషిచేశారని అన్నారు.అనంతరం రేషన్ డీలర్ల ఆధ్వర్యంలో అంకాలు ని ఘనంగా సన్మానించారు. బాపులపాడు మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షురాలు ఎనుముల లలిత కుమారి,ఉంగుటూరు మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు బొబ్బిలి నవీన్ , చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్ కగ్గా గాంధీ,కార్యదర్శి విజయజ్యోతి, గౌరవాధ్యక్షులు శేఖర్, జోజి,రామారావు, ఆనందకుమారి,కొలవెంటి చంద్రశేఖర్, మాతంగి కిషోర్, రెడ్డి రఘుబాబు, పల్లెపాముల రత్నం బాపులపాడు, ఉంగుటూరు మండలాల రేషన్ డీలర్లు,రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# చందాపురం గ్రామంలో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**▶▶ సిఐటియు సేవలు అభినందనీయం**



**నందిగామ,జూన్,21,(మనం న్యూస్):** నందిగామ మండలం చందాపురం గ్రామంలో ఆదివారం సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో చందాపురం గ్రామంలో సచివాలయం నందు వాసన్ కంటి హాస్పిటల్ వారు గ్రామ ప్రజలకు ఉచిత కంటి , వినికిడి వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరం కు ప్రజలు నుండి మంచి స్పందన లభించింది. ఉదయాన్నే పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని వైద్య సేవలు పొందారు. కంటి మరియు వినికిడి పరీక్షలు ఉచితంగా చేసి మందులు అందజేశారు. అవసరమైన వారికి ఉచితంగా ఆరోగ్యశ్రీ ద్వారా కంటి ఆపరేషన్లు చేస్తామని వైద్య అధికారులు పేర్కొన్నారు. చందాపురం గ్రామంలో పెద్ద సంఖ్యలో వృద్ధులు, మహిళలు, పెద్దలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అర్హులైన వారికి కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. తెలుగు యువత రాష్ట్ర నాయకులు కొంగర నరేంద్ర పాల్గొని వైద్య శిబిరం కు తోడ్పాటు నిందించారు. ఈ సందర్భంగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎన్ సి హెచ్ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించటంలో సిఐటియు ముందంజలో వుందని తెలిపారు. ఇటీవల కీసర గ్రామంలో సిఐటియు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం కు ప్రజలు నుండి మంచి స్పందన లభించిందని తెలిపారు. రానున్న రోజు లలో గ్రామీణ ప్రజలకు మరిన్ని ఉచిత వైద్య వైద్య శిబిరాలు నిర్వహించటానికి సిఐటియు సిద్ధంగా వుందన్నారు. ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలకు ప్రజలు సహకారం ఎంతో వుంటుందని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు దూర ప్రాంతాలకు సైతం విస్తరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు కటారపు గోపాల్, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా నాయకులు మన్నె తిరుమల దేవి, డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు రాము, నందిగామ నాయకులు గోపి నాయిక్, లాల్ సలాం, ఎం శ్రీనివాసరావు, రవి శేఖర్, ఎవి నారాయణ, అజయ్, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు, నేత్ర వైద్యులు డా. పల్లవి, శోభన్ బాబు, పావని, వినికిడి వైద్యులు ఎండి హఫీజ్ ఆర్. నవీన్, అంగన్వాడీ కార్యకర్తలు అరుణ, విజయలక్ష్మి, సావిత్రి, మిడ్ డే మీల్స్ నిర్వాహకులు బొల్నిడి పద్మ, టైలర్స్ -సిహెచ్ లక్ష్మి, సంధ్య,మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పి. మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

# 6,65,810 ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ

**▶▶ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**విజయవాడ,జూన్,21,మనం ప్రతినిధి:** భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు జిల్లాలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ-సర్ ప్రక్రియకు సంబంధించి ఇంటింటి సర్వే సాఫీగా జరుగుతోందని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్ ప్రక్రియకు సంబంధించి జిల్లాలో 17,13,445 మంది ఓటర్లు ఉన్నారని, బీఎల్వోలు ఇప్పటివరకు 6,65,810 మంది (38.86 శాతం) ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు అందించినట్లు, అదేవిధంగా 35,802 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పూర్తయినట్లు వెల్లడించారు. సర్ ప్రక్రియను సజావుగా నిర్వహించడంలో ఈ.ఆర్.ఓ.లు, ఏ.ఈ.ఆర్.వో.లు, బీ.ఎల్.వో.లు, సూపర్‌వైజర్లు కీలక పాత్ర పోషించేలా దిశానిర్దేశం చేసినట్లు పేర్కొన్నారు. ఇంటింటి సర్వేలో భాగంగా జులై 14వ తేదీ వరకు బీఎల్వోలు ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు అందిస్తారని, నింపిన వాటిని తిరిగి సేకరిస్తారని, ఇందుకు ప్రతి ఇంటికీ కనీసం మూడుసార్లు వెళ్లనున్నారని తెలిపారు. అర్హులను ఓటరు జాబితాలో ఉండేలా చేయడంతోపాటు అనర్హులు, మృతులు, శాశ్వతంగా వలసవెళ్లిన వారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేర్లు ఉండటం వంటి వారి ఓట్లను తొలగించి స్వచ్ఛమైన ఆరోగ్యకరమైన ఓటర్ల జాబితా లక్ష్యంగా చేపట్టిన ఈ సర్ ప్రక్రియలో ప్రజలు చైతన్యవంతంగా పాల్గొని ఈ బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు.



# నిద్రమత్తులో మండల విద్యాశాఖాధికారి




**▶▶ విద్యార్థుల పుస్తకాల ఖరీదు నియంత్రించే అధికారులు లేరా…?**

**▶▶ 1వ తరగతి విద్యార్థుల పాఠ్యపుస్తకాలు 7500 రూపాయలు…?**

**కంచికచర్ల (మనం న్యూస్)ః** పాఠశాలలు ప్రారంభం అయ్యి 10 రోజులు కావస్తున్నా ఇంతవరకు ఎక్కడా కూడా తనిఖీ చెయ్యని అధికారులు. కంచికచర్ల పట్టణంలో ఉన్న సంస్క ృతి పాఠశాలలో విద్యార్థుల పాఠ్యపుస్తకాలకు అధిక ధరలు వసూలు చేస్తున్నారు…. ప్రభుత్వ జీవో ప్రకారం పాఠశాలలో పాఠ్యపుస్తకాలు అమ్మకాలు చేయకూడదు.కంచికచర్ల పట్టణంలో ఉన్న అన్ని ప్రైవేట్ పాఠశాలలో పుస్తకాలు ఒక వ్యాపారం చేస్తున్నారు… సంబంధిత మండల విద్యాశాఖాధికారిఏమి చేస్తున్నారో ఎవరికి తెలియటం లేదు.విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలని చదివించాలి అంటే భారంగా ఉంటుందని తల్లిదండ్రులు భాదను వ్యక్తపరుస్తున్నారు.ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నత అధికారులు స్పందించి తక్షణమే సంస్క ృతి విద్యా మందిర్ ప్రవేట్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# విజయవాడ క్లబ్ లో కంపోస్టు తయారీపై అవగాహన



**తాడేపల్లి,జూన్ 21, మనం న్యూస్ః** స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర స్ఫూర్తితో విజయవాడ క్లబ్ నందు నాడెస్ కంపోస్ట్ తయారీ విధానంపై ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 8 గంటలకు విజయవాడ క్లబ్ లో గల కంపోస్ట్ షెడ్ వద్ద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విజయవాడ క్లబ్ క్యాంటీన్ నుండి ఉత్పత్తి అయ్యే సేంద్రీయ వ్యర్థాలు, ఎండు, పండు ఆకులతో కంపోస్టు తయారీ విధానాన్ని వివరించారు. క్లబ్ సభ్యులు మద్దుకూరి గ్రీన్ ఇండియా 2023 అవార్డు గ్రహీత వెంకట సుబ్బారావు కంపోస్టు తయారీని వివరించారు. క్లబ్ లోని సేంద్రియ ఎరువులను తమ ప్రాంగణంలోని ఉద్యానవనాలకు వినియోగిస్తున్నట్లు చెప్పారు. ఇండియన్ రెడ్ క్రాస్ చైర్ పర్సన్ మాధవి, రెడ్ క్రాస్ మెంబర్ డాక్టర్ విజయకుమార్, విజయవాడ క్లబ్ అధ్యక్షులు రామినేని రామ్మోహన్, ఉపాధ్యక్షులు రావూరి వెంకట సుబ్బారావు, కార్యదర్శి చంద్రశేఖర రావు, సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వరరావు, కోశాధికారి మహేంద్ర కుమార్ జైన్ పాల్గొన్నారు.

# నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వినతుల స్వీకరణ



**విజయవాడ,జూన్,21,(మనం న్యూస్)ః** ఈ నెల 22వ తేదీ సోమవారం కలెక్టరేట్ లో ప్రజా స్నేహపూర్వక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం … పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్ ద్వారా అర్జీల స్వీకరణ చేపట్టనున్నట్టు తెలిపారు. కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంతో పాటు డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అదేవిధంగా అర్జీదారులు తమ అర్జీలను వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చని .. నమోదైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100 కి నేరుగా కాల్ చేయవచ్చన్నారు.

### ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి

# యోగానే పునాది

**యోగాంధ్ర ద్వారా యోగాను ప్రజల జీవితాల్లో భాగం చేయాలనే లక్ష్యం**

**యోగ శారీరక, మానసిక ఆరోగ్యానికి అత్యుత్తమ మార్గం**

**కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్**



**గుంటూరు , జూన్ 21: (మనం న్యూస్ ప్రతినిధి):** యోగాను భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వారసత్వమని కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా.పెమ్మాసాని చంద్ర శేఖర్ పేర్కొన్నారు.12 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్లో నిర్వహించిన అంతర్జాతీయ యోగాంధ్ర కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి యోగా. పెమ్మసాని చంద్రశేఖర్,జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ , జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ,గుంటూరు మున్సిపల్ కమిషనర్ మయూర్ అశోక్ పాల్గొన్నారు.అంతర్జాతీయా యోగా దినోత్సవం సందర్భంగా దేశ ప్రధాని నరేంద్ర మోడీ న్యూ ఢిల్లీ నుండి పాల్గొన్న కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని,ప్రసంగాన్ని వీక్షించడం జరిగింది.అనంతరం ఆయుష్ శాఖ యోగా ఇన్స్ట్రక్టర్ వెంకటేష్ కార్యక్రమంలో పాల్గొన్న వారిచే యోగాభ్యాసాలు చేయించారు.గుంటూరు నటరాజ్ అకాడమీ యోగా గురువు విజయ గౌరీ నేతృత్వంలో సూర్యమంత్రంతో సూర్య నమస్కారాలు,యోగా ద్వారా సమతుల్య ఆహారాన్ని ఎలా తీసుకోవాలి అనే అంశాన్ని నృత్య ప్రదర్శన ప్రదర్శించారు.

అనంతరం కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.యోగం కేవలం వ్యాయామం మాత్రమే కాదు, శరీరం - మనసు - ఆత్మ మధ్య సమతుల్యతను తీసుకువచ్చే జీవన విధానమన్నారు. ఆలోచనకు స్పష్టత, ఆవేశానికి నియంత్రణ,జీవితానికి సమతుల్యతను అందించే మార్గమే యోగ.ప్రపంచానికి శాంతి మార్గాన్ని చూపిన భారతదేశం అందించిన గొప్ప బహుమతి యోగ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కృషితో యోగా ప్రపంచ వ్యాప్తంగా మరింత విస్తరించి, అంతర్జాతీయ గుర్తింపు పొందిందన్నారు.నేడు 177 దేశాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకోవడం భారతదేశానికి గర్వకారణమన్నారు.ఒత్తిడితో కూడిన ఆధునిక జీవనశైలిలో యోగం ప్రతి ఒక్కరికీ అత్యవసరమని,శరీరాన్ని దృఢంగా, మనసును ప్రశాంతంగా, ఆలోచనలను సానుకూలంగా మార్చే శక్తి యోగానికి ఉందన్నారు.యోగం ద్వారా ఆరోగ్యవంతమైన వ్యక్తులు, ఆరోగ్యవంతమైన కుటుంబాలు, ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని , యువత మొబైల్ ఫోన్లు, స్క్రీన్లకు పరిమితం కాకుండా యోగాను అలవాటు చేసుకోవాలని పిలుపునిచారు. జూన్ 21 ఒక్క రోజు మాత్రమే కాకుండా ప్రతి రోజూ యోగాను జీవితంలో భాగం చేసుకోవాలన్నారు.యోగా చేసే దేశం ఆరోగ్యంగా ఉంటుందని, ఆరోగ్యమైన దేశంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ మాట్లాడుతూ భారత దేశం యోగాను ప్రపంచ దేశాలకు పరిచయం చేసిందని , ఒక దేశ పౌరునిగా ఇందుకు చాలా గర్వపడుతున్నానని పేర్కొన్నారు.యోగాను 175 దేశాలు దత్తత చేసుకున్నాయని , సుమారు 190 దేశాలు అమలు చేస్తున్నాయన్నారు.యోగా ద్వారా ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలో ప్రపంచానికి భారతదేశం నేర్పించ్చిందన్నారు. ముఖ్యమంత్రి ఈ సంవత్సరం మెగా క్యాంపెన్ లో లాంచ్ చేసి





15 రోజులు పెట్టడం జరిగింది.గత సంవత్సరం ఒక నెల రోజుల పాటు క్యాంపెన్ పెట్టి ప్రపంచ రికార్డు నెలకొల్పే విధంగా విశాఖపట్నం లో సుమారు మూడు లక్షల మందితో యోగా చేయడం జరిగిందన్నారు. ఈ 15 రోజుల యోగా క్యాంపెన్ గుంటూరు జిల్లా నుండి 11 వేల మంది ట్రైనర్లను గుర్తించి , అనేక స్థాయిలలో పోటీలు నిర్వహించి సుమారు 4.50 లక్షల మంది వరకు రిజిస్టర్ అయి యోగా ప్రాక్టీస్ చేయడం జరిగిందన్నారు.ఈ క్యాంప్ వరకే కాకుండా యోగాను మన జీవన శైలిలో ఒక భాగస్వామ్యం చేసుకోవాలని ముఖ్యమంత్రి పులుపునిచ్చారన్నారు.మనం ఎప్పుడు చూడని కొత్త రోగాలు చూస్తున్నామని 40 సంవత్సరాల వయస్సుకే అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న సమయంలో మన పూర్వీకులు అందించిన యోగా ఒక వరమన్నారు.దీనిని మరచిపోకుండా ప్రతి రోజు దినచర్యలు భాగం చేసుకుంటే దీని నుండి వచ్చే ఆరోగ్య ఫలితాలు కేవలం మనమే కాకుండా మన కుటుంబ సభ్యులు,మన సమాజం మన రాష్ట్రాన్ని కూడా ఆరోగ్య ఆంధ్ర ప్రదేశ్ గా తీర్చిదిద్దాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి ఈ క్యాంపెన్ ను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు.మన జిల్లాను ఒక ఆరోగ్యమైన జిల్లాగా తీర్చిదిద్దేందుకు ముందుకు వెళ్లాలని ఆశిస్తూ ఈ 12 వ అంతర్జీతీయ యోగా దినోత్సవం రోజునే కాకుండా ప్రతి రోజు ఒక గంట పాటు యోగా చేసి ఆరోగ్యవంతమైన జిల్లాగా తీర్చిదిద్దాలని కోరుకుంటు ,ఈ యోగా దినోత్సవంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి నమస్కారాలు తెలియజేస్తున్నానన్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ యోగా మన దేశంలో ప్రారంభం అయి ప్రపంచలోని 190 దేశాలు ఆచరిస్తున్నాయన్నారు.దేశ ప్రధాని మోడి ద్వారా అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రారంభమైందన్నారు. అన్ని దేశాలలో తమ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకుంటున్నాయని,మన దేశంలో కంటే కూడా ఇతర దేశాలలో యోగాను ఎక్కువ మంది అభ్యశిస్తున్నారన్నారు. దేశ ప్రధాని ఈ సంవత్సరం యోగానుఆరోగ్యం, జ్ఞానం మరియు ప్రపంచ శాంతి కోసం అనే థీమ్ తో ప్రవేశపెట్టారన్నారు.కార్యక్రమంలో డిఆర్ ఓ ఎన్.ఎస్.కే.ఖాజావలి,ఆర్ డి ఓ కే.శ్రీనివాస రావు,డియం అండ్ హెచ్ ఓ డా.విజయలక్ష్మీ,జిల్లా అధికారులు,జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పిల్లి మాణిక్యరావు,మాజీ డిప్యూటీ మేయర్ షేక్ సజీలా,ప్రజా ప్రతినిధులు,విద్యార్థులు ,ప్రజలు పాల్గొన్నారు.





# ప్రశాంతంగా ముగిసిన నీట్-2026 పరీక్ష- 94.13 శాతం హాజరు నమోదు



**పరీక్షా నిర్వహణను పర్యవేక్షించిన కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

విజయవాడ,జూన్, 21,(మనం న్యూస్): నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ద్వారా నిర్వహించిన జాతీయస్థాయి వైద్య విద్య ప్రవేశ పరీక్ష నీట్ (యూజీ)-2026 ఆదివారం ఎన్టీఆర్ జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో 31 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా మొత్తం 10,920 మంది అభ్యర్థులకుగాను 10,279 మంది (94.13 శాతం) హాజరైనట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ పరీక్ష ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ విజయవాడలోని వివిధ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం అయిదు గంటల 15 నిమిషాల వరకు పరీక్ష జరిగిందని.. అభ్యర్థుల ధ్రువీకరణ, బయోమెట్రిక్ హాజరు, భద్రత.. ఇలా ప్రతి విషయంలోనూ జాగ్రత్తలు తీసుకున్నామని, ఏర్పాట్ల విషయంలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూశామన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద తాగునీటితో పాటు వైద్య శిబిరాలు, నిరంతర విద్యుత్ సరఫరా వంటి ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్ష విజయవంతానికి కృషిచేసిన నీట్ కోఆర్డినేటర్లు, అబ్జర్వర్లు, పరీక్ష కేంద్రాల సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లతో పాటు రెవెన్యూ, మునిసిపల్, విద్యుత్, ప్రజా రవాణా తదితర సమన్వయ శాఖల అధికారులకు అభినందనలు తెలియజేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.